క్లుప్తంగా

రేపు గుండె జబ్బుల వైద్య నిపుణులు రాక

– ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ఉదయం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా కర్నూలు విశ్వ భారతి ఆసుపత్రి గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత వ్యాధులకు చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్థన్‌రెడ్డి షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్షలు నిర్వహించాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు గాంధీ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాముడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన క్యాంటీన్‌లోని కౌంటర్, భోజనం వడ్డించే విధానం, సదుపాయాలు తదితర వాటిని సందర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ లోకేష్ పాల్గొన్నారు.

నేత్రదానం



మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను సేకరిస్తున్న రాజు

పులివెందుల రూరల్ : మండలంలోని నల్లపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన తుపాకుల కుళ్లాయమ్మ శుక్రవారం మరణించడంతో ఆమె కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు ఆమె కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపినట్లు తెలిపారు. నేత్రదానం చేయదలుచుకున్న వారు 9966509364 లేదా 7093204537 సమాచారం ఇవ్వాలన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడి గెలవాలి

ఎర్రగుంట్ల : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు సంబంధించి అండర్–14, 17 విభాగాలలో విద్యార్థులకు శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ఎంఈఓ శివప్రసాద్ ప్రారంభించి మాట్లాడారు. కబడ్డీ, యోగా, చెస్, బ్యాడ్మింటన్ ఆటలలో క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు శనివారం కూడా కొనసాగుతాయన్నారు. కాంప్లెక్స్ హెచ్ఎం రామాంజనేయరెడ్డి, మండల కోర్డినేటర్ పీడీలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్క రైతు ఇ-పంట నమోదు చేసుకోవాలి

జమ్మలమడుగు రూరల్ : మండలంలోని ప్రతి ఒక్క రైతు తప్పనిసరిగా ఇ-పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడువు ఈనెల 23వ తేదీ వరకు ఉందన్నారు. ఇ-పంట నమోదు చేసుకోవడం వల్ల పంటల బీమా, పంట నష్టపరిహారం, ధాన్యం కొనుగోలు సులభతరం ఆవుతుందన్నారు. మండల వ్యాప్తంగా 2,180 మంది రైతులు ఉండగా 1845 మంది ఇ-కేవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలిన 335 మంది రైతులు ఇ-కేవైసీ చేయించుకోవాలన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

జమ్మలమడుగు : మున్సిపాలిటీ కార్మికుల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి ప్రతాప్ కోరారు. శుక్రవారం వారు మున్సిపల్ కార్మికులతో వెళ్లి కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పారిశుద్ధ్య కార్మికులకు జాతీయ సెలవుదినాలలో సెలవులు ఇవ్వాలన్నారు. మహిళా పారిశుద్ధ్య కార్మికులకు ఐదురోజుల పాటు సెలవు దినాలను మంజూరు చేయాలని సూచించారు. పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తూ మరణించిన కుటుంబలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

లింగాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని శుక్రవారం మండల స్పెషలాఫీసర్ మురళీమోహన్‌రెడ్డి సందర్శించి కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం లింగాల గ్రామ సచివాలయంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లోకేశ్వరరావు, ఏపీఓ గంగరాజు, మండల ఏఈ రామసూరారెడ్డి, ఏఓ రాఘవేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ 100 రోజుల పాలనపై ప్రజల్లో పెదవి విరుపులే



కమలాపురం రా కదలిరా సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు (ఫైల్)



చెన్నూరులో జరిగిన సభలో మాట్లాడుతున్న నారా లోకేష్ (ఫైల్)



వల్లూరు : ఎన్నికలకు ముందు రా కదలిరా పేరుతో అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సభలను నిర్వహించారు. అందులో భాగంగా కమలాపురం పట్టణంలోని సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో ఈ ఏడాది జనవరి 19వ తేదీన సభను నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న ఆయన తాను అధికారం చేపట్టగానే పేదరికం లేని సమాజం చూడాలన్న ఎన్టీఆర్ ఆశయాన్ని సాధించడానికి బాధ్యత తీసుకుంటానని, సంపద సృష్టించి ప్రతి పేదవాడికి న్యాయం చేస్తానని ప్రకటించారు. సంపద సృష్టించడం టీడీపీకి మాత్రమే తెలుసునన్నారు. సంపద సృష్టించడం మాట దేవుడెరుగు అధికారం చేపట్టిన మొదటి 100 రోజుల్లోనే వేలాది కోట్లు అప్పులు చేశారని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- వర్క్ ఫ్రం హోం నిర్వహణకు తోడ్పాటునందించడంలో భాగంగా ప్రతి మండలానికి రెండు వర్క్ స్టేషన్లు నిర్మించి యువతను ప్రపంచానికి అనుసంధానం చేస్తానన్నారు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్‌లను సైతం నిలిపివేసి వాటి ఊసే ఎత్తక నిరుద్యోగులకు తీవ్ర నిరాశ కలిగించారు. ఎంతో మంది యువతకు కాస్తో కూస్తో ఆర్థిక వెసులు బాటుగా వున్న వలంటీర్ పోస్టులపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేక పోయారు. కనీసం విద్యార్థుల ఉన్నత చదువులకు తోడాపటునందించడానికి ఉద్దేశించిన ఫీజు రీయంబర్స్‌మెంట్ పై స్పష్టత ఇవ్వక పోవడం, కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలను విడుదల చేయక పోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు ఇచ్చి రైతు రాజ్యం తెస్తానన్నారు. ప్రతి నెల మహిళలకు రూ.1500, విద్యార్థులకు ఎలాంటి కోతల్లేకుండా ఏటా రూ.15000 ఇస్తానన్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వీటిలో ఏ ఒక్కటీ ఇప్పటి వరకూ అమలుకు నోచుకోక పోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో వున్నారు.
- యువగళం పేరుతో ప్రస్తుత సీఎం చంద్రబాబు నాయుడు తనయుడు, ప్రస్తుత మంత్రి నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో భాగంగా గత ఏడాది జూన్ 5వ తేదీన కమలాపురం నియోజకవర్గంలోని చెన్నూరులో బహిరంగ సభను నిర్వహించి మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏటా రూ.20 వేలు జమ చేస్తామని ప్రకటించారు.
- ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం లాగా బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకువస్తామని, న్యాయ పోరాటాలకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ప్రటించారు.
- పేదలందరికీ టిడ్కో ఇళ్లు నిర్మిస్తామని ప్రకటించారు.
- నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి ఉచితంగా నీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు.
- అయితే టీడీపీ అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తయినప్పటికీ వీటిలో ఏ ఒక్కటీ అమలు చేయక పోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. జగన్ సీఎంగా వుండి వుంటే పథకాలన్నీ ప్రజలకు సకాలంలో అందేవని చర్చించుకుంటున్నారు.

గాలిలో హామీలు

జమ్మలమడుగు/మైలవరం : 2023 మే నెలలో పెద్దముడియం మండలం సుద్దపల్లె గ్రామంలో నిర్వహించిన మీటింగ్‌లో రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోనికి వస్తే ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామంటూ టీడీపీ జాతీయ కార్యదర్శి విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ తెలిపారు. అలాగే రాజోళి ఆనకట్ట కింద ముంపునకు గురి అయ్యే గ్రామాల ప్రజలకు ఏకరాకు రూ.24 లక్షల పరిహారం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోనికి వచ్చి 100 రోజు అయినా రాజోళి గురించి అసలు ఊసేలేకుండాపోయింది.

- గండికోట ముంపువాసులకు అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 6లక్షల 25వేలు పరిహారం నుంచి ఏకంగా రూ. 10 లక్షలు ఇస్తామని ప్రకటించారు. చాలా గ్రామాలకు పరిహారం రూ. 10 లక్షలు పంపిణీ చేశారు. మొదటి విడతలో ఉన్న గ్రామాల ప్రజలకు పరిహారం ఇవ్వవలసి ఉంది. అయితే బీజేపీ తరపున పోటీ చేసిన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముంపువాసులకు రూ. 10 లక్షలు కాకుండా అదనంగా మరో రెండు లక్షలు పరిహారం ఇప్పిస్తామని ప్రకటించారు. ఇంత వరకు దీని ఊసేలేదు.
- గండికోట టూరిజం అభివృద్ధితోపాటు స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అసలు స్టీల్ ప్లాంట్ ఎక్కడ నిర్మాణం జరుగుతుందో దానిపైన సరైన క్లారిటి లేకుండాపోయింది.

– జమ్మలమడుగు చేనేత ప్రాంతంలో చేనేత కార్మికులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. గుంత మగ్గల తోపాటు కరెంటు మగ్గలు ఉన్నాయి. చేనేత కార్మికుల ప్రతి ఇంటికి 200 వంద యూనిట్‌లు మరమగ్గాల కార్మికులకు 500 యూనిట్‌లు ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

- ప్రతి చేనేత కుటుంబానికి రూ. 24 వేల ఆర్థిక సాయం
- చేనేతలకు 3 సెంట్ల స్థలంతోపాటు ఉచిత గృహ నిర్మాణంతో పాటు వర్క్ షెడ్ ఏర్పాటు
- ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా
- జనతా వస్త్రాల కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి
- నూలు, ముడి సరుకులు, రంగులపై సబ్సిడీ
- ప్రతి నియోజకవర్గంలో చేనేత బజార్లు ఏర్పాటు
- చేనేతలకు జనాభా ప్రకారం కార్పొరేషన్ నిధుల సమీకరణ, స్వయం ఉపాధి
- నేతన్నలకు డిజైనింగ్ మార్కెటింగ్ జిల్లా కేంద్రాలలో శిక్షణ
- చేనేత వస్త్రాలకు ప్రత్యేక ట్యాగ్ అంతర్ జాతీయ మార్కెటింగ్

ఇచ్చిన హామీ అమలు చేస్తే ఉపయోగంగా ఉంటుంది



ఎన్నికల ముందు గండికోట ముంపు బాధితులకు రూ. 10 లక్షల పరిహారానికి ఆదనంగా రెండు లక్షలు ఇస్తామని కూటమి నాయకులు చెప్పారు. ఇప్పుడు అధికారంలోనికి వచ్చింది. ఇచ్చిన మాట ప్రకారం పరిహారం పంపిణీ చేస్తే ఎంతో మంది ముంపుబాధితులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– కర్నాటి అనిల్‌కుమార్‌రెడ్డి, చౌటిపల్లి ముంపు గ్రామం, కొండాపురం.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల తరలింపు



నిత్యావసర సరుకుల వాహనాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : విజయవాడలోని వరద బాధితులకు వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల వాహనాన్ని శుక్రవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. వరద బాధితులు సర్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వారి అవసరాలను తీర్చేందుకు వైఎస్సార్‌సీపీ సరుకులను అందించి ఆదుకోవడం జరుగుతుందన్నారు. వారి సహాయార్థం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా పార్టీ ఆధ్వర్యంలో విరాళాలు అందించి వరద బాధితులను ఆదుకునే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, వాల్మీకి సంఘ నాయకులు నారాయణస్వామి, బలిజ సంఘం నాయకులు సోపాల వీరా, మైనార్టీ నాయకులు నూరుల్లా, విద్యార్థి సంఘ నాయకులు జశ్వంత్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేంపల్లె : విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు విరాళాలను సేకరించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. 150 కేజీల బియ్యం, దుస్తులు, రూ.28 వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు పంపినట్లు తెలిపారు. మిగతా వస్తువులను యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌కు అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఓబుల్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించడమే స్వచ్ఛభారత్ లక్ష్యం



జెఎన్‌టీయూలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు

పులివెందుల రూరల్ : ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తొలగించడమే స్వచ్ఛభారత్ లక్ష్యమని స్వచ్ఛ భారత్ నిర్వహణాధికారిణి శేష మహేశ్వరమ్మ తెలిపారు. పట్టణంలోని జెఎన్‌టీయూ కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విద్యార్థులు కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. మొదట నుంచి కళాశాల స్వచ్ఛత, పరిశుభ్రత, పచ్చదనం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణకాంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుబ్బారెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎర్రగుంట్లలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

మొక్కలు నాటితేనే ఆక్సిజన్ లభ్యం

ఎర్రగుంట్ల : ప్రతి ఒక్కరు ఒక మొక్కను నాటితే పచ్చదనం వృద్ధితో పాటు ఆక్సిజన్ లభిస్తుందని మండల విద్యాధికారి శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రకాశ్‌నగర్ కాలనీలో నిర్వహించిన స్వచ్ఛత సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొని పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి, సహోపాధ్యాయురాలు ఉమాదేవి, ఎస్ఎంసీ చైర్ పర్సన్ నాగవేణి, వైస్ చైర్‌పర్సన్ సుకన్య, విశ్రాంతి ఉపాధ్యాయులు సుబ్బిరెడ్డిలు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వం కాదు.. ముంచే ప్రభుత్వం

చెన్నూరు : చంద్రబాబు ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాదని... ప్రజలను ముంచే ప్రభుత్వమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైందని, తమ ప్రభుత్వం మంచి ప్రభుత్వమని ఎన్డీఏ కూటమి నాయకులు సొంత డబ్బా వాయించుకోవడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికల్లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చేందుకు సూపర్ సిక్స్ హామీలు ప్రధాన కారణమన్నారు. అయితే ఒక సామాజిక పెన్షన్ తప్ప మిగిలిన ఐదు హామీలు అమలు కావడం లేదన్నారు. పులివెందుల మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ 50 సీట్లు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం వద్దని చెప్పడం అసమర్థతకు పరాకాష్ట అన్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిందని విమర్శించిన టీడీపీ గడిచిన వంద రోజుల్లో రూ.25 వేలు కోట్లు అప్పు చేయడం విడ్డూరమన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

వేంపల్లె : స్థానిక ఏపీ మైనార్టీ గురుకుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు స్కూలు ప్రిన్సిపాల్ సుగుణమ్మ తెలిపారు. నేషనల్ హెల్త్ ప్రోగ్రాం కంట్రోల్ ఆఫ్ బ్లైండ్ నెస్ అండర్ స్కూల్ హెల్ప్ ప్రోగ్రాంలో భాగంగా 320 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న 28 మంది విద్యార్థులకు కంటి అద్దాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు జి.రెడ్డన్న, సిహెచ్‌ఓ వెంకటరత్నం, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఏఎన్ఎం అరుణ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



లింగాల : విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుధాకర్‌రెడ్డి

లింగాల : ఇప్పట్ల సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి పరీక్షల నిపుణులు సుధాకర్ రెడ్డి విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవతమ్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నిత్యం పౌష్టికాహారం తీసుకుంటూ ఫాస్ట్ ఫుడ్ జంక్ ఫుడ్ మానేస్తే దృష్టిలోప సమస్యలు రావని, తద్వారా చదువులో రాణించి తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేస్తారన్నారు. అనంతరం డాక్టర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దృష్టి లోపం ఉన్న విద్యార్థినులకు ప్రభుత్వం కంటి అద్దాలు ఇస్తుందన్నారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసమ్మ, సేవాసమితి అధ్యక్షుడు రాజు, ఏఎన్ఎం స్వర్ణ, హెల్త్ సూపర్ వైజర్ విజయలక్ష్మి, ఆశా కార్యకర్త పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

23వ తేదీలోపు ఇ-కేవైసీ చేయించుకోవాలి

వీరపునాయునిపల్లె : ఇ-కేవైసీ చేయించుకునేందుకు ఈనెల 23వ తేదీతో గడువు ముగుస్తుందని మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. శుక్రవారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ రాయితీలు పొందాలంటే పంట నమోదుతో పాటు ఇ-కేవైసీ తప్పనిసరిగా చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటలు సాగుచేసి పంట నమోదు చెయించుకున్న ప్రతి రైతు ఇ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. ఇ-కేవైసీ చేయించుకోని రైతులు ఎవరైనా ఉంటే రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి చేయించుకోవాలన్నారు.

కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ నర్సులు

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వ ఆసుపత్రులలో 15 సంవత్సరాల నుంచి కాంట్రాక్ట్ కింద విధులు నిర్వహిస్తున్న నర్సులను రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీఓ 115 వెంటనే రద్దు చేయాలన్నారు. తమను కూడా ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

లింగాల : పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మానవతా సేవా సంస్థ పులివెందుల వారు పాఠశాల విద్యార్థులకు ×విద్యార్థుల నైతిక విలువలు₹ అనే అంశం మీద వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ రామకృష్ణ, మానవత సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమ ర్యాలీ



పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విద్యార్థులకు పచ్చదనం, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులచే పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అలాగే భాకరాపురంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లో సిబ్బంది మొక్కలు నాటి నీరు పోశారు.

హామీల అమలుకు శ్రీకారం

వేంపల్లె : టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టినట్లు టీడీపీ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని వైఎస్ఆర్ సభా భవనంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 100 రోజుల తెలుగుదేశం పార్టీ పరిపాలన గురించి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివిజ సంపతి, ఈవోపీఆర్డీ మల్లికార్జున రెడ్డి పాల్గొన్నారు.

'దుర్మార్గులు దేవుడిని కూడా వదలడం లేదు'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు వరప్రసాద్, తదితరులు

పులివెందుల రూరల్ : దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే దుర్మార్గమైన మనస్తత్వం గలవాడు చంద్రబాబు అని పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డిలు శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తైన సందర్భంగా ఎక్కడ ప్రజలు నిలదీస్తారోనని భయంతో కలియుగ దైవం తిరుమల తిరుపతి లడ్డూపై అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవడం ధర్మమేనా? ప్రతి ఆరు నెలలకొకసారి నెయ్యి సరఫరా కోసం టెండర్లు పిలుస్తారని. నెయ్యి నాణ్యత నిర్ధారణ పరీక్షను ఎవరూ మార్చలేదన్నారు. వంద రోజుల పాలనలో ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ప్రజల ముందు తిరగలేదన్నారు. ఎన్నికల ముందు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు అమలుపై ప్రజలు నిలదీస్తారని దేవునిపై డైవర్షన్ రాజకీయాలు మానుకుని ఇకనైనా పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు తెలపాలన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ ఇన్‌చార్జి పార్నపల్లె కిశోర్, కౌన్సిలర్ కోడి రమణ, తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డుపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

జమ్మలమడుగు : కలియుగ దైవం శ్రీవెంకటేశ్వర స్వామి తిరుపతి లడ్డుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన తప్పుడు ప్రచారం తెలుగు ప్రజల ఆత్మగౌరవం కించపరిచేవిధంగా ఉందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి యోబు అన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎర్పడిన తర్వాతనే పరీక్షలు చేశారు. రెండు నెలల పాటు నెయ్యిని కొనుగోలు చేశారు. తప్పు మీవద్ద పెట్టుకుని ఆ నిందను వైఎస్సార్‌సీపీపై వేయడం సరైందికాదన్నారు. ఎంబీబీఎస్ సీట్ల విషయం పక్కదారి పట్టించడం కోసమే ఇటువంటి ప్రచారాలు చేస్తున్నారన్నారు.

పుట్టిన బిడ్డకు ఆరునెలలు తల్లిపాలు ఇవ్వాలి



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

పులివెందుల రూరల్ : పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి తెలిపారు. పట్టణంలోని భాకరాపురంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం-1లో ఆమె పోషకాహార మాసోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలు, తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, పద్మావతి, వసుంధర, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

తొండూరు : స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారంపై ఎంఈఓ భారతి గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పించి మాట్లాడారు. కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పుల్లమ్మ, ఆశా వర్కర్ కుమారి, సూపర్‌వైజర్ రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం రామకృష్ణ తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 9959225780 ఫోన్ నెంబర్‌కు తమ సమస్యలను వాట్సాప్ ద్వారా తెలియజేయాలన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

చక్రాయపేట : మండల అభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాధవీ బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. అలాగే నీటి పథకాలకు సంబంధించి విద్యుత్ సర్వీసులు తక్షణం కల్పించాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. అనంతరం జడ్పీటీసీ శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ మండలంలో వర్షాభావ కారణంగా బోర్లు ఎండిపోయాయన్నారు. నిమ్మ, మామిడి, వరి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. మండలాన్ని కరవు మండలంగా ప్రకటించి ప్రతి రైతుకు ప్రభుత్వ సాయం అందేలా చూడాలని ఎమ్మెల్సీని కోరారు. అలాగే మండల రైతుల కోసం జగనన్న ప్రభుత్వంలో కాలేటివాగు ప్రాజక్టు పనులు ప్రారంభం అయ్యాయన్నారు. అవి సుమారు 80 శాతం మేర పూర్తయ్యాయన్నారు. త్వరితగతిన ప్రాజక్టు పనులు పూర్తి చేయిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. స్పందించిన ఎమ్మెల్సీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు ప్రారంభం అయ్యేలా చూస్తానన్నారు. అలాగే మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేందుకు కృషి చేస్తానన్నారు. గండికొవ్వూరు వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే తాము ఆత్మహత్యలు చేసుకుంటామని డీఆర్వో ఎదుట రైతులు ఆవేదన వ్యక్తం చేశారని అయినా ఇసుక రీచ్‌కు అనుమతి ఇచ్చారని తెలిసిందని గ్రామస్తులు కొందరు ఎమ్మెల్సీకి వివరించారు. స్పందించిన ఆయన ఇసుకరీచ్‌పై కలెక్టర్‌తో మాట్లాడి రద్దు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఆజాద్‌వల్లి, తహసీల్దారు విజయకుమారి, ఎంపీడీవో సోమశేఖర్, మండల ఉపాధ్యక్షులు వేదమూర్తి, గఫూర్, ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులు పాల్గొన్నారు.